సీసీ రోడ్డు పనులు ప్రారంభం


నార్తలాలాగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సహకారంతో పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. నార్తలాలాగూడ ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె సోమవారం ప్రారంభించారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్, అమర్, ఎల్లయ్య, కైరంకొండ, దేవయ్య, గోనె, సంతోష్, జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్ సబ్‌కమిటీ రిపోర్డు అందజేయడంపై హర్షం

లాలాపేట: గత ప్రభుత్వం ధ్వంసం చేసిన స్థానికతను పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీఓ 317పై కేబినెట్ సబ్ కమిటీ తన రిపోర్టును సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయడంపై బాధిత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జెఏసి ప్రసిడెంట్ విజయ్ కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్ నాగేశ్వర్‌రావు, సందీప్, మధుసూదన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ కేబినెట్ సబ్ కమిటీ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు త్వరితగతిన రిపోర్టును అందజేసిందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

లాలాపేట: ఆదివాసి ఎరుకల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ఎస్టీ కమీషన్‌తో పాటు ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీరామ్ సదానందతో కలిసి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ 500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించి, ఎస్టీ కమీషన్‌ను ఏర్పాటు చేసి దానికి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన వారినే చైర్మెన్‌గా నియమించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కుతాడి రవికుమార్, కోనేటి నర్సింహా, వనం రమేష్, శ్రీరామ్ ఆనంద్,ప్రభాకర్, సురేష్, శ్రీనివాస్, ఎల్లయ్య, సత్యానారాయణ, యాదగిరి,సాయి తదితరులున్నారు.

బీజేపీ నేత గణేష్ ముదిరాజ్‌కు సతీ వియోగం


సుక్క అర్చన (ఫైల్)

లాలాపేట: మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి సుక్క గణేష్ ముదిరాజ్‌కు సతీ వియోగం కల్గింది. గణేష్ భార్య సుక్క అర్చన(47) కొంత కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ఏఐజి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటుంది. సోమవారం తెల్లవారుజామున హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచింది. లాలాపేట ఇందిరానగర్‌లోని గణేష్ ముదిరాజ్ నివాసానికి సుక్క అర్చన పార్థీవ దేహాన్ని తరలించారు. బీజేపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, అడ్డగుట్ట కార్పొరేటర్ లింగానీ లక్ష్మీప్రసన్న, వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు అర్చన పార్థీవ దేహం వద్ద శ్రద్ధంజలి ఘటించారు.

బండ మైసమ్మనగర్‌లో సర్వే


సోషల్ ఆడిట్ సర్వే నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ సిబ్బంది

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ మురికివాడలో కేంద్ర ప్రభుత్వం తరపున అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో సోషల్ ఆడిట్ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుడి వివరాలు సేకరించారు. చాచానెహ్రూనగర్, జీవై కంపౌండ్, బండమైసమ్మనగర్ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు అధికారులు విలేకరులతో చెప్పారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సుధీర్‌కుమార్


నియామక ఉత్తర్వులు అందుకుంటున్న సుధీర్‌కుమార్

అమీర్‌పేట్: టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సుధీర్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మా ఇళ్లను తొలగించొద్దు

- రోడ్డు విస్తరణను 200 నుంచి 100 అడుగులకు తగ్గించాలి
- రాజీవ్ రహదారిలోని ఆస్తుల యజమానుల ధర్నా



మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు తెలుకుంట సతీష్ గుప్త

రసూల్‌పురా: రాజీవ్ రహదారి రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా 200 అడుగులకు విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాజీవ్ రహదారిలోని ఆస్తుల యజమానుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కన్వీనర్ తెలుకుంట సతీష్‌గుప్త ఆధ్వర్యంలో పలువురు భారీ ర్యాలీ నిర్వహించారు. సోమవారం కార్ఖాన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం తిరుమలగిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు వెడల్పు తగ్గించండి. మా జీవితాలను కాపాడండి... మా ఇళ్ళను తొలగించొద్దు... మాకు న్యాయం చేయండి.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేతలు పరశురాం, భానుక మల్లి ఖార్జున్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తెలుకుంట సతీష్ గుప్త మాట్లాడుతూ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని రోడ్డు విస్తరణను 200 నుంచి 100 అడుగులకు తగ్గించాలని డిమాండ్ చేశారు.

నగరంలోని ప్రధాన మార్గాలన్నీ వంద అడుగులే...

హైదరాబాద్ జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్, మాదాపూర్ గచ్చిబౌలి, హిమాయత్‌నగర్, బేగంపేట ఆబిడ్స్ నాంపల్లి, హైటెక్‌సిటీ వంటి అనేక ప్రధాన ప్రాంతాలు వంద అడుగుల రోడ్లతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వాహనాలు కొనసాగుతున్నాయన్నారు. ఎంజీ రోడ్. జింఖానా రోడ్‌లో 80 అడుగుల రోడ్డు మాత్రమే ఉందని ఆ వెడల్పుకు అదనంగా మరో 20 అడుగులు సేకరించాలని కోరారు. ఉప్పల్ ప్రధాన రహదారిపై 200 అడుగల నుంచి 150 అడుగలకు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. తాము అభివద్ధికి వ్యతిరేకం కాదని కాని ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి వంద అడుగుల విస్తరణ సరిపోతుందని ప్రస్తుత 200 అడుగల విస్తరణ విషయమై ఆస్తులు, వ్యాపారాలు, వేలాది మంది ప్రజల జీవనోపాధి ప్రయోజనాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని మరో జేఏసీ సభ్యుల అమర్‌నాథ్ సూచించారు.


తిరుమలగిరి చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

నిరుపేద విద్యార్థికి చేయూత

సనత్‌నగర్: చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదని మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్ మణిదీప్ అన్నారు. చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని అరోరా డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న స్నిగ్దం దీక్షిత్ యాదవ్‌కు ట్రస్ట్ తరుపున రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి తమ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందన్నారు.


నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మణిదీప్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు

బంజారాహిల్స్: గోల్కొండ హోటల్ చైర్మన్ రామిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. గోల్కొండ హోటల్ డైరెక్టర్ ఆపరేషన్స్ శ్యామల శ్రీనివాస్‌రెడ్డి, జీఎం రమేష్, ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాస్, గోల్కొండ రిసార్ట్స్ టీమ్ ఈ కార్యక్రమంలో పాల్గొని సర్కారు బడి విద్యార్థులతో కలిసి సామూహిక భోజనాలు చేశారు. ఈ పాఠశాలలో తరచూ గోల్కొండ హోటల్స్ అండ్ రిసార్ట్స్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు సన్నిహితం అయింది. ఇందులో భాగంగానే సోమవారం విందు ఏర్పాటు చేశారు.

తల్లి, కుమారుడి అదృశ్యం


అదృశ్యమైన తల్లికొడుకులు రూప, అభిరామ్‌లు

చిలకలగూడ: తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత తెలిపిన మేరకు.. వరంగల్‌కు చెందిన బసవరాజుల రూప (36), రాజు భార్యభర్తలు. నగరానికి వలసవచ్చి సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో నివసిస్తున్నారు. అస్వస్థతకు గురైన రాజు స్వస్థలమైన వరంగల్‌కు వెళ్లిపోగా, తొమ్మిదేళ్ల కుమారుడు అభిరామ్‌తో కలిసి రూప ఇందిరా నగర్‌లో ఉంటుంది. గత మూడు నెలల నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడం, రూప సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కూకట్‌పల్లిలో ఉంటున్న బంధువైన కవిత ఈనెల 20న ఇందిరానగర్‌కు వచ్చింది. తాళం వేసి ఉండడంతో ఇంటి ఓనర్‌ను సంప్రదించగా, గత మూడు నెలల నుంచి ఇంటికి తాళం వేసే ఉందని తెలిపాడు. దీంతో కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉత్సాహంగా నేషనల్ మెమొరీ చాంపియన్‌షిప్ పోటీలు

సనత్‌నగర్: ఇండియన్ నేషనల్ మెమొరీ చాంపియన్‌షిప్–2024 పోటీలు బేగంపేటలోని ది మనోహర్ హోటల్‌లో సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ హాజరై మాట్లాడుతూ జ్ఞాపకశక్తికి, మేధస్సును మెరుగుపర్చడానికి ఇలాంటి పోటీలు అవసరమని, ఇలాంటి పోటీలను మరింత ఆదరణ పెరగాలన్నారు. దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన సుమారు 180 మంది పోటీల్లో పాల్గొనగా విన్నర్‌గా ప్రతీక్‌యాదవ్, మొదటి రన్నర్‌గా విశ్వరాజకుమార్, రెండో రన్నర్‌గా బీఏ అచింత్‌లు గెలుపొందారు. విజేతలకు ఇండియన్ మెమొరీ కౌన్సిల్ అధ్యక్షుడు స్క్వాడ్రన్ లీడర్ జయసింహా, చీఫ్ ఇన్‌ఛార్జి డాక్టర్ శ్రీనివాసకుమార్, ఈవెంట్ స్పాన్సర్స్ వైరల్ పే సేల్స్ అండ్ సర్వీసెస్ పీఆర్ శ్రీనివాసన్‌లు హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నటుడు కేవీ ప్రదీప్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమ, సైకాలజిస్ట్ వీరేందర్, షేక్ సిరాజుద్దీన్, క్రోనస్ ఫార్మా అధ్యక్షుడు శ్రీకాంత్ గొగర్చేడు పాల్గొన్నారు.

ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- ఎమ్మెల్సీ వాణీదేవి

సనత్‌నగర్: సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) ఆధ్వర్యంలో సోమవారం ఖాదీ ఉత్పత్తులపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పీపుల్స్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రాంలో భాగంగా స్వామి రామానందతీర్థ ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో శ్రీవెంకటేశ్వర కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. ఖాదీ ప్రాధాన్యతను నేటితరం విద్యార్థులకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ పోటీలు జరిగాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ ఖాదీ సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక, అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణరావు, ఎస్ఆర్‌టీఐ డైరెక్టర్ శేఖర్ మారంరాజు, శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ సురభి అజిత తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి

అంతా నా ఇష్టం..

జీహెచ్‌ఎంసీ మాజీ ఉద్యోగి నిర్వాకం ..
రోడ్డుపై బురదనీటిని వదిలేస్తున్న వైనం



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేట సత్యానగర్‌లో జీహెచ్‌ఎంసీ మాజీ ఉద్యోగి ఇటీవలే ఓ ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతల్లో నుంచి మట్టి బురదతో కూడిన నీటిని, వ్యర్థాలను రోడ్డుపై యదేచ్ఛగా వదిలేస్తున్నాడు. దీంతో సత్యానగర్ కాలనీ రోడ్డంతా బురదమయంగా మారింది. నాలుగు రోజుల నుంచి ఇదే పరిస్థితి. స్థానికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇది భరించలేని సత్యానగర్ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం సాయంత్రం అతనిని ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడారు. ఈ విషయమై సత్యానగర్ వాసులు వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో లాలాగూడ పోలీసులు సత్యానగర్‌కు వెళ్లి అతనిని పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా సత్యానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగేందర్, ఉపాధ్యక్షులు సత్తయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు ప్రభాకర్, మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేస్తూ కాలనీ వాసులందరికి ఇబ్బంది కల్గిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేస్తున్నారు.


చిత్తడిగా, బురదమయంగా మారిన సత్యానగర్ రోడ్డు

అయ్యప్ప మాలధారణ పవిత్ర పుణ్యకార్యం


పాదయాత్ర ప్రారంభిస్తున్న తలసాని

రాంగోపాల్‌పేట్: అయ్యప్ప మాలధారణ అత్యంత కఠినమైన నియమ నిష్టలతో కూడిన పుణ్యకార్యక్రమమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గణపతి దేవాలయంలో గురుస్వామి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రను ప్రారంభించారు. 120 మంది బృందం 1230కి.మీ పాదయాత్ర నవంబర్ 27వ తేదీన శబరి చేరుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, సైకిలాబ్‌యాదవ్, మహేష్‌యాదవ్, దేవాలయ మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే శ్రీగణేష్


అయ్యప్ప భక్తుల పాదయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: దేవాలయాలపై దాడులు చేసిన వారికి కఠిన శిక్షలు పడేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో కఠిన చట్టాలను తయారు చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీధర్మశాస్త్ర పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గణేష్ దేవాలయం నుంచి శబరికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరిగినపుడు హడావిడి చేయడం జైలుకు, బెయిలుతో నిందితులు బయటకు వచ్చి మళ్లీ, మళ్లీ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ముత్యాలమ్మ దేవాలయంపై దాడికి పాల్పడిన నిందితుడు ముంబయ్‌లో రెండు సార్లు ఇలాగే చేసి వచ్చి ఇక్కడ చేశాడని అక్కడ బీజేపీ ప్రభుత్వం ఉన్న సమయంలోనే జరిగిందని గుర్తు చేశారు. అక్కడ కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇక్కడ జరిగి ఉండేది కాదని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయని, అందుకే పార్లమెంటులో పూర్తి మెజార్టీ ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం కఠిన చట్టాలు తయారు చేసే మళ్లీ, మళ్లీ ఇలా చేయాలంటే నిందితులు భయపడతారని ఆయన అన్నారు. సున్నితమైన ఇలాంటి అంశాలను ప్రతిపక్షాలు అదనుగా తీసుకుని ఉద్రిక్తలు సృష్టించడం మంచి పరిణామం కాదన్నారు. 9వ సారి పాదయాత్రగా వెళుతున్న అయ్యప్ప భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసికుని సురక్షితంగా తిరిగి రావాలనే భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

పరుపుల దుకాణంలో స్వల్ప అగ్నిప్రమాదం

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధి వారాసిగూడలోని పరుపుల దుకాణంలో సోమవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటలు పరుపులు, దిండ్లుకు అంటుకుని దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదే సమయంలో అటుగా వచ్చిన జలమండలి ఎయిర్‌టెక్ మిషన్ ద్వారా నీటిని పంపింగ్ చేసి మంటలను అదుపు చేశారు. అనంతరం అగ్నిమాపక అధికారులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. (కిలో..రూపాయల్లో)టమాటా. 39, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 50, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 21, దోసకాయ 35, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 17, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ వీసీ ఛాంబర్ వద్ద సందడి


వీసీని సన్మానిస్తున్న టైంస్కేల్ ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ఛాంబర్ వద్ద బుధవారం సందడి నెలకొంది. ఇటీవల వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.కుమార్‌ను కలసి అభినందనలు తెలిపేందుకు సోమవారం వందల సంఖ్యలో వచ్చారు. గతంలో ఎన్నడులేని విధంగా విద్యార్థులు, దళిత, బహుజన, వాపక్ష, బీఆర్‌ఎస్వీ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, హాస్టల్ వర్కర్స్, టైంస్కేల్ ఉద్యోగులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు ఇలా అనేక మంది వీసీని కలసి వివిధ అంశాల పై మాట్లాడి శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందనలు తెలిపారు. వీసీ ప్రొ.కుమార్ ఆప్యాంగా పలకరిస్తూ నవ్వుతు స్వాగతం పలికినందుకు సంతోషంగా ఉందని సందర్శకులు తెలిపారు. ఇదిలా ఉండగా సమస్యల పై చర్చించేందుకు వీసీ 15 రోజుల గడువు అడిగినందున నేడు (22న) చేపట్టిన ర్యాలీని వాయిదా వేసుకున్నట్లు టైంస్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు విఠల్‌గౌడ్ తెలిపారు.